సాక్షి
ఆదిలాబాద్

మంగళవారం | 6 | మే | 2025



ట్రిపుల్ఐటీ విస్తరణ

బాసర ట్రిపుల్ఐటీకి అనుబంధంగా మరో రెండు క్యాంపస్‌ల ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టి సారించింది. అధికారుల బృందం ఎల్కతుర్తి, మహబూబ్‌నగర్‌లో భూములు పరిశీలించింది.

8లో▸



హార్వెస్టర్లకు డిమాండ్..

జిల్లాలో యాసంగిలో సాగు చేసిన జొన్న కోతలు ప్రస్తుతం ముమ్మరంగా సాగుతున్నాయి. కూలీల కొరతతో రైతులు హార్వెస్టర్లపై ఆధారపడుతున్నారు.

9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
38.0/27.0

చాలా వరకు ఎండగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు కొంత తగ్గినా ఉక్కపోత ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలి



ర్యాలీలో పాల్గొన్న శ్రీధర్‌స్వామి, శాస్త్రవేత్తలు, రైతులు

తాంసి: రైతులు వానాకాలం సాగుకు సంబంధించి నాణ్యమైన విత్తనాలు, ఎరువుల ను ఎంపిక చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్ స్వామి అన్నారు. మండలంలోని పొన్నారి గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం ఆదిలాబాద్ ఆధ్వర్యంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పంచాయతీ కార్యాలయ ఆవరణలో రైతులతో నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించే పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. పంటమార్పిడితో దిగుబడి పెరిగే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం సేంద్రియ ఎరువులు, రసాయనాల వినియోగం,సాగునీటిఆదా, మట్టి పరీక్షలు తదితర అంశాలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. ముందుగా రైతులతో కలిసి ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ వై.ప్రవీణ్‌కుమార్,శాస్త్రవేత్తలు రాజశేఖర్, మోహన్‌దాస్, శేషా ద్రి, సునీల్ కుమార్, జి.శివచరణ్, వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు రాజేందర్ రెడ్డి, ప్రవీణ్, తాంసి ఇన్‌చార్జి ఏడీఏ రవీందర్, మాజీ సర్పంచ్ అశోక్, మాజీ ఎంపీటీసీ రఘు, రైతులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె జయప్రదం చేయండి



సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: ఈ నెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలని గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న కోరారు. ఈ మేరకు సోమవారం సంఘం ఆధ్వర్యంలో జిల్లా పంచాయతీ కార్యాలయ ఉద్యోగి శ్రీనివాస్ గౌడ్‌కు సమ్మె నోటీసు అందజేశారు. పంచాయతీ కార్మికులకు అమలు చేస్తున్న మల్టీ పర్పస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, ఉద్యోగ, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా చేపడుతున్న సమ్మెలో జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఇందులో యూనియన్ నాయకులు అశోక్, వెంకట్రావు, సోనేరావు, గంగన్న, కిరణ్, సంతోష్, రాజేందర్, శంకర్ ఉన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు

ఈ నెల 20న దేశవ్యాప్త కార్మిక సమ్మెలో ఆదిలాబాద్ మున్సిపాలిటీ కార్మికులు పాల్గొనాలని మున్సిపల్ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. ఈమేరకు సోమవారం ఆ సంఘం ఆధ్వర్యంలో కమిషనర్ సీవీఎన్.రాజును కలిసి సమ్మె నోటీసు అందజేశారు. ఇందులో సంఘ బాధ్యులు జనార్దన్, భిక్షపతి, శ్యామ్ తదితరులున్నారు.

సాగుకు సన్నద్ధం

- వానాకాలం పంటల కోసం..
- దుక్కులు సిద్ధం చేస్తున్న రైతులు
- అంచనాకు మించి విత్తనాలు.. సరిపడా ఎరువులు
- ప్రణాళిక రెడీ అంటున్న వ్యవసాయశాఖ



దుక్కిదున్ని చేనును సాగుకు సిద్ధం చేస్తూ..

సాక్షి,ఆదిలాబాద్: వానాకాలం పంటల సాగుకు జిల్లా రైతాంగం సన్నద్ధమవుతోంది. దుక్కులు దున్ని చేలను చదును చేసే పనుల్లో బిజీగా మారారు. మరోవైపు భూసారం పెంచేందుకు అందుబాటులో ఉన్నవారు సేంద్రియ ఎరువులతో పాటు చెరువు మట్టిని పొలాల్లో వేస్తున్నారు.

జిల్లాలో పరిస్థితి..

జిల్లాలో యాసంగితో పోల్చితే వానాకాలంలోనే పంటల సాగు అధికంగా ఉంటుంది. కేవలం వర్షాధారంగానే 70 శాతం వరకు సాగవుతుంటుంది. దీంతో ఈ సీజన్ వస్తుందంటే జిల్లా రైతులంతా బిజీ అవుతారు. ప్రధానంగా జిల్లాలో పత్తిని ఎక్కువగా పండిస్తారు. ఆ తర్వాత సోయా, కందులు, ఇతరత్రా పంటలు సాగు ఉంటుంది. గత వానాకాలంలో 5లక్షల 79వేల 124 ఎకరాల్లో పంటలు సాగు కాగా, ఈ ఏడాది 5లక్షల 85వేల 350 ఎకరాల్లో సాగు కానున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు.

పెరగనున్న పత్తి విస్తీర్ణం..

జిల్లాలో ఈ ఏడాది కూడా పత్తి, సోయా, కంది పంటలు అధిక విస్తీర్ణంలో సాగు కానున్నాయి. ఇందులో 75 శాతం వరకు పత్తి ఉండనుంది. గతేడాదితో పోల్చితే ఈ సారి పత్తి సాగు విస్తీర్ణం పెరగనుందని, అలాగే సోయా కొంత తగ్గే అవకాశముందని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. మరోవైపు ఈ ఏడాది పత్తి విత్తనాలు విరివిగా లభ్యమయ్యే పరిస్థితి ఉండడంతో రైతులు అటువైపే మొగ్గుచూపే అవకాశం ఉందని చెబుతున్నారు.

ప్రణాళిక సిద్ధం..

వానాకాలం పంటల సాగు కోసం వ్యవసాయ శాఖ ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ సీజన్‌లో ఏయే పంటలు ఎంత సాగవుతాయి.. దానికి అనుగుణంగా విత్తనాలు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయా.. అనే అంశంలో ఇప్పటికే ఆయా విత్తన కంపెనీలతో వ్యవసాయ శాఖ సమావేశాలు పూర్తి చేసింది. ఈ సీజన్‌లో పత్తి విత్తనాల ప్యాకెట్లు అంచనాకు మించి అందజేసేందుకు కంపెనీలు సిద్ధంగా ఉన్నాయని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో గతంలో మాదిరి విత్తనాల కొరత ఏర్పడేందుకు ఆస్కారమే లేదని పేర్కొంటున్నారు. కలెక్టర్ రాజర్షిషా ఆదేశాల మేరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అంతే కాకుండా పోలీసు, రెవెన్యూ, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ టీంలను ఏర్పాటు చేసి నకిలీ విత్తనాల విక్రయాలు అరికట్టేందుకు యంత్రాంగం పాటుపడుతుంది.

జిల్లాలో వానాకాలం పంటల సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)..

పంట	2024లో	2025లో (అంచనా)	అవసరమయ్యే విత్తనాలు(క్వింటాళ్లలో)
పత్తి	4,36,473	4,40,000	11,00,840 ప్యాకెట్లు
సోయాబీన్	65,464	62,500	18,725
కంది	57,258	55,000	21,960
జొన్న	1493	1600	66
మొక్కజొన్న	15066	23000	1,834
వరి	2030	1900	489
పెసర	546	550	22
మినుము	561	550	44
ఇతరత్రా	231	250	12

అవసరమయ్యే ఎరువులు (మెట్రిక్ టన్నుల్లో)

ఎరువులు	అవసరం	అందుబాటులో ఉన్నది
యూరియా	35,000	18,000
డీఏపీ	13,000	4,000
కాంప్లెక్స్	36,000	24,000
ఎంఓపీ	7,000	1,134
ఎస్ఎస్‌పీ	4,000	1,071

కొరత లేదు..



వానాకాలం సాగు కోసం రైతులకు పూర్తిస్థాయిలో విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టాం. ఈసారి పత్తి విత్తనాలను అంచనాకు మించి సరఫరా చేసేందుకు ఆయా కంపెనీలు సిద్ధంగా ఉన్నాయి. ఎలాంటి కొరత లేదు. ఇతర విత్తనాలు కూడా అందుబాటులో ఉంచుతున్నాం. ఎరువులను కోటా మేరకు సరిపడా ఉండేలా చర్యలు చేపడుతున్నాం.

– శ్రీధర్ స్వామి, జిల్లా వ్యవసాయ అధికారి

శిక్షణతో పిల్లల్లో ప్రత్యేక ప్రావీణ్యం

- ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: శిక్షణతో పిల్లల్లో ప్రత్యేక ప్రావీణ్యం లభిస్తుందని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీల అభివృద్ధి విద్యార్థి దశ నుంచే ప్రారంభం కావాలని అన్నారు. ఇందులో భాగంగానే జిల్లాలో నాలుగు చోట్ల ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆదిలాబాద్‌లోని పోలీస్ హెడ్‌క్వార్టర్, ఇచ్చోడ, ఇంద్రవెల్లి, నార్నూర్‌లలో వీటిని ప్రారంభించినట్లు చెప్పారు. నాలుగు కేంద్రాల్లో 470 మంది విద్యార్థులకు యోగా, కరాటే, కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, బాస్కెట్‌బాల్ తదితర కీడాంశాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. తద్వారా చిన్నారుల్లో మానసిక, శారీరక దృఢత్వం పెంపొందుతుందన్నారు. అలాగే పోలీసు స్టేషన్ల సందర్శన, సిబ్బంది విధుల నిర్వహణ, జైలు సందర్శన, ఆయుధాల ఉపయోగం, వాటి పనితీరు, పోలీసులు తీసుకుంటున్న కఠోర శిక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సురేందర్ రావు, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్.జీవన్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు కరుణాకర్, వెంకటి, చంద్రశేఖర్, శిక్షకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్



శిబిరానికి హాజరైన పిల్లలు

బోథ్ పోలీస్ స్టేషన్ తనిఖీ

బోథ్: అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సోమవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని సిబ్బందికి సూచించారు. డయల్ 100, బ్లూకోర్ట్ సిబ్బంది గ్రామాలను సందర్శిస్తూ సమాచార సేకరణలో ముందుండాలని సూచించారు. ఆయన వెంట సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై ప్రవీణ్ ఉన్నారు.

అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం



వేదికపై కేంద్రమంత్రులు నితిన్ గడ్కరీ, కిషన్‌రెడ్డి, సంజయ్, రాష్ట్రమంత్రులు వెంకట్‌రెడ్డి, సీతక్క, ఎంపీలు నగేశ్, వంశీ కృష్ణ, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, బొజ్జు, కోవ లక్ష్మి, హరీశ్‌బాబు, రామారావుపటేల్

- కేంద్ర రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ
- జాతీయ రహదారి– 363 ప్రారంభం.. జాతికి అంకితం
- నాగ్‌పూర్ టు హైదరాబాద్‌కు ఆరు వరుసల రహదారి నిర్మాణానికి హామీ
- హాజరైన కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు



సభకు హాజరైన ప్రజలు

రెబ్బెన(ఆసిఫాబాద్): 'ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన జిల్లా, ఈ జిల్లాకు ప్రత్యేక చరిత్ర ఉంది. ఇక్కడ నివసించే ఆదివాసీలు భూమి కోసం, భుక్తి కోసం ఎన్నో పోరాటాలు చేశారు. అలాంటి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం' అని కేంద్ర రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. కుమురంభీం జిల్లా రెబ్బెన మండలంలోని కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ వద్ద సోమవారం ఏర్పాటు చేసిన ఎన్‌హెచ్– 363 ప్రారంభోత్సవ సభ విజయవంతమైంది. కుమురంభీం జిల్లాతోపాటు మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లాల నుంచి బీజేపీ కార్యకర్తలు, ప్రజలు ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చారు. 'అందరికీ నమస్కారం.. బాగున్నారా' అంటూ కేంద్ర మంత్రి ప్రజలను ఆత్మీయంగా తెలుగులో పలకరించారు. మంచిర్యాల జిల్లా నుంచి మహారాష్ట్ర సరిహద్దులోని కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి వరకు నిర్మించిన నాలుగు వరుసల జాతీయ రహదారితోపాటు పలు సెక్షన్లలో చేపట్టిన పనులను కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి ప్రారంభించి జాతికి అంకితం చేశారు.అంతకుముందు ఉదయం 10.48 గంటలకు నాగ్‌పూర్ నుంచి హెలికాప్టర్ ద్వారా కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్డు వద్దకు చేరుకున్నారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, అధికారులు ఘన స్వాగతం పలికారు. పోలీస్ సిబ్బంది గౌరవ వందనం స్వీకరించిన అనంతరం సభాస్థలికి చేరుకుని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఉదయం 11.47 గంటలకు రూ.3,900 కోట్లతో చేపట్టిన జాతీయ రహదారుల పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి గడ్కరీ మాట్లాడుతూ రానున్న మూడేళ్లలో రూ.2లక్షల కోట్లతో రోడ్లను అభివృద్ధి చేస్తామని తెలిపారు. గడిచిన పదేళ్లలో దేశంలో జరిగిన అభివృద్ధి ట్రైలర్ మాత్రమేనని, అసలైన సినిమా ముందుందన్నారు. జాతీయ రహదారుల విస్తరణతో అభివృద్ధికి బాటలు వేస్తామన్నారు. అన్ని రాష్ట్రాలను జాతీయ రహదారులతో అనుసంధానం చేస్తామని, తెలంగాణలో రహదారులను మరింత అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. రాష్ట్రంలో రూ.లక్ష కోట్లతో గ్రీన్‌వే నిర్మాణానికి కృషి చేస్తున్నామని, నాగ్‌పూర్ టు విజయవాడ వరకు చేపట్టే రహదారితో మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందన్నారు. ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, విజయవాడ మీదుగా రహదారి నిర్మిస్తున్నామన్నారు. నాగ్‌పూర్ నుంచి హైదరాబాద్‌కు ఆరు వరుసల రహదారికి కృషిచేస్తున్నామని తెలిపారు. 2014 తర్వాత రాష్ట్రంలో రూ.వేల కోట్లతో రహదారులను అభివృద్ధి చేసిన ఘనత ప్రధాని నరేంద్రమోదీదన్నారు. మధ్యాహ్నం 12.20 గంటల వరకు ప్రసంగించి, 12.30 గంటలకు కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ నుంచి కేంద్ర మంత్రి బయలుదేరి వెళ్లిపోయారు. కార్యక్రమాల్లో ఎంపీలు గోడం నగేశ్, గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్సీలు దండె విఠల్, మల్క కొమురయ్య, అంజిరెడ్డి, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, పాల్వాయి హరీశ్‌బాబు, పాయల్ శంకర్, వెడ్మ బొజ్జు, రామారావు పటేల్, ప్రేంసాగర్‌రావు, రోడ్డు భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్‌రావు, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, ఏఎస్పీ చిత్తరంజన్ తదితరులు పాల్గొన్నారు.

కనెక్టివిటీ రోడ్డు సౌకర్యం కల్పించాలి



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇరిగేషన్ వసతి సక్రమంగా లేకపోవడంతో అభివృద్ధిలో వెనుకబడిపోయింది. అటవీశాఖ అనుమతులు లేక అనేక రోడ్ల పనులు ముందుకు సాగడం లేదు. గ్రామాలకు కనెక్టివిటీ సౌకర్యం కల్పించాలి. అటవీశాఖ అనుమతుల ప్రక్రియ త్వరగా పూర్తిచేసి రహదారులు పూర్తయ్యేలా చూడాలి. ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాంతాలను కలుపుతూ రోడ్లు నిర్మించాలి.

– ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర మంత్రి సీతక్క

మరిన్ని రహదారులు నిర్మించాలి



తెలంగాణ రాష్ట్రానికి పక్కన ఉన్న మహారాష్ట్రతో అనుసంధానిస్తూ మరిన్ని జాతీయ రహదారుల నిర్మాణం చేపట్టాలి. జిల్లాలో 300 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి నిర్మాణం చేపట్టిన ఘనత ప్రధాని నరేంద్ర మోదీకే దక్కుతుంది. అదే తరహాలో ఆదిలాబాద్ నుంచి ఉట్నూర్, ఆసిఫాబాద్ మీదుగా మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా అల్లాపల్లి వరకు జాతీయ రహదారి నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలి. తద్వారా ఈ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. పెండింగ్ పనులు పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలి.– ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్

ప్రజావాణిలో 'ఇందిరమ్మ' గోడు

- భారీగా తరలివచ్చిన దరఖాస్తుదారులు
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్

కైలాస్‌నగర్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పొరపాట్లు ప్రజావాణిపై ప్రభావం చూపాయి. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి గతంలో ఎన్నడు లేని విధంగా భారీగా తరలివచ్చారు. ఇందులో అత్యధికులు ఇందిరమ్మ ఇళ్లు రాలేదని నివేదించిన వారే కావడం గమనార్హం. మండుటెండను సైతం లెక్కచేయకుండా తరలివచ్చిన వారు ఉన్నతాధికారుల ఎదుట తమగోడు వెల్లబోసుకున్నారు. కలెక్టర్ రాజర్షి షా బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం 2గంటలు కావడంతో కార్యక్రమం ముగించినట్లుగా కలెక్టర్ ప్రకటించడంతో అధికారులంతా సమావేశ మందిరం నుంచి వెళ్లిపోయారు. కలెక్టర్ సైతం బయలుదేరుతుండగా అప్పటికే బయట పెద్ద సంఖ్యలో ఉన్న అర్జీదారులు ఒక్కసారిగా సమావేశ మందిరంలోకి వచ్చారు. దీంతో కలెక్టర్ అరగంట పాటు నిలబడే వారి నుంచి వినతులు స్వీకరించారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో జరిగిన పొరపాట్లపై విచారణ జరిపించి అర్హులకు న్యాయం చేస్తామని కలెక్టర్ భరోసానిచ్చారు. అధికారికంగా 148 అర్జీలు అందినట్లుగా అధికారులు చెబుతున్నప్పటికీ మరో 80 మంది వరకు ఆన్‌లైన్ చేయకుండానే చివరి నిమిషంలో నేరుగా అందజేశారు. ఇందులో జెడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి, డీఆర్డీవో రాథోడ్ రవీందర్, కలెక్టరేట్ ఏవో వర్ణ, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు. ఈవారం అర్జీదారుల్లో కొందరి నివేదన..



బాధితుల సమస్యలు ఆలకిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

పనివేళలు కుదించాలి

ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులతో ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు పనిచేయిస్తున్నారు. ఎండల తీవ్రత రోజురోజుకు పెరగడంతో కార్మికులు అనారోగ్యానికి గురై ఆసుపత్రుల్లో చేరుతున్నారు. కార్మికుల ఆరోగ్యం దృష్ట్యా పని వేళలు ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకే కుదించాలి.

– టీఎమ్మార్పీఎస్ నాయకులు, ఆదిలాబాద్

ఈ మేరకు స్పందించిన కలెక్టర్ వెంటనే కమిషనర్ రాజుతో మాట్లాడారు. కార్మికులతో ఉదయం 11గంటల వరకు మాత్రమే పనులు చేయించాలని ఆదేశించారు.

ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాలే ..




సార్.. మాది భీంపూర్ మండలం గోముత్రి గ్రామం. ఏళ్లుగా నివసిస్తున్న మాకు పక్కా ఇళ్లు లేకపోవడంతో చిన్న పాటి గుడిసెల్లోనే కాలం వెల్లదీస్తున్నాం. కూలీనాలితోనే పొట్టపోసుకుంటున్నాం. ప్రభుత్వం ప్రకటించిన ఇందిరమ్మ ఇళ్లకు అర్హులమైనప్పటికీ అధికారులు మంజూరు చేయలేదు. పక్కా ఇళ్లు ఉన్న వారికే కేటాయించారు. సెక్రటరీని అడిగితే పట్టించుకోవడం లేదు. దీనిపై విచారణ జరిపి మాకు న్యాయం చేయాలని కోరుతున్నాం.

న్యాయం చేయండి..



నా పేరు అచ్చవార్ రాజు. బేల మండలంలోని మసాల(బి) గ్రామం. నా పేరిట గ్రామ శివారులోని సర్వే నంబర్ 30/3 లో 1.05 ఎకరాల భూమి ఉంది. దాన్ని సాగు చేసుకుంటు జీవిస్తున్నాను. మా కుటుంబానికి ఆ భూమే ఆధారం. 1955 నుంచి పట్టాభూమిగా ఉండగా 2015–16 నుంచి ధరణిలో అసైన్డ్‌గా చూపిస్తోంది. దీంతో ప్రభుత్వపరంగా అందాల్సిన ప్రయోజనాలేమి రావడం లేదు. 2023లో ధరణిలో దరఖాస్తు చేయగా డిప్యూటీ తహసీల్దార్, తహసీల్దార్ పట్టాభూమిగా ఆమోదించారు. కానీ ఆర్డీవో రిజెక్ట్ చేసి కలెక్టర్ లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్నట్లుగా చూపుతోంది. దీనిపై విచారించి అసైన్డ్‌గా ఉన్న భూమిని పట్టాగా మార్చి న్యాయం చేయాలని కోరుతున్నా.

అర్హులమైనా ఇళ్లు మంజూరు చేయలేదు



మాది గుడిహత్నూర్ మండలం కొల్హారి గ్రామం. మేమంతా కూలీనాలి చేసుకుని జీవించే నిరుపేదలం. మాకు పక్కా ఇండ్లు లేవు. గుడిసెలు, రేకుల షెడ్లలో ఏళ్లుగా కాలం వెల్లదీస్తున్నాం. ప్రభుత్వం ప్రకటించిన ఇందిరమ్మ ఇళ్లకు మేము అన్ని విధాలా అర్హులమైనా మంజూరు కాలేదు. గ్రామానికి 20 ఇండ్లు మంజూరు కాగా పంచాయతీ కార్యదర్శి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కుమ్మక్కై ఇళ్లు ఉన్నవారికే మంజూరు చేశారు. మండల స్థాయి అధికారులను అడిగితే కమిటీ నిర్ణయమే మా నిర్ణయమని అంటున్నారు. అధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలి.

ఆరోగ్య పాఠశాలతో విద్యార్థుల్లో మార్పు

- కలెక్టర్ రాజర్షిషా
- 'పది'లో సత్తా చాటిన విద్యార్థులకు సన్మానం

ఆదిలాబాద్‌టౌన్: ఆరోగ్య పాఠశాల కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో మార్పులు వచ్చాయని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను జెడ్పీ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అందరి సహకారంతో జిల్లా పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిందన్నారు. రాష్ట్రస్థాయిలో 97.18 శాతం ఉత్తీర్ణతతో 9వ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించడం అభినందనీయమని కొనియాడారు. ఇందులో డీఈవో శ్రీనివాస్ రెడ్డి, డీఐఈవో జాదవ్ గణేశ్ కుమార్, డీసీఈబీ సెక్రెటరి గజేందర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులతో కలెక్టర్

భూ సమస్యలు పరిష్కరించాలి

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): భూ సమస్యలు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. సోమవారం భోరజ్ మండలంలోని కోర్టా గ్రామంలో భూభారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. హెల్ప్‌డెస్క్ కౌంటర్లలో రిసెప్షనిస్టులను ఏర్పాటు చేశారు. వీటిని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భోరజ్ మండలంలో 28 రెవెన్యూ గ్రామాలు ఉండగా, తొలిరోజు కోర్టాతో పాటు గణేష్‌పూర్,పూసాయి గ్రామాల్లో సదస్సులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. రైతులు భూ సమస్యలపై దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, తహసీల్దార్ రాథోడ్ రాజేశ్వరి,ఆర్ఐ భరద్వాజ్,తదితరులుపాల్గొన్నారు.

కలెక్టర్‌కు సన్మానం

నార్నూర్: ఇటీవల ప్రధాని చేతుల మీదుగా జాతీయఅవార్డు అందుకున్న కలెక్టర్ రాజర్షి షాను గోండ్వానా రాయిసెంటర్ జిల్లా సార్‌మేడి మెస్రం దుర్గు పటేల్ సోమవారం కలెక్టరేట్‌లో కలిసి శాలువాతో సన్మానించారు. ఆయన వెంట రూప్‌దేవ్, నాగోరావు తదితరులున్నారు.

ఉచిత విద్య అభినందనీయం

ఆదిలాబాద్‌టౌన్: పీపుల్స్ ప్రోగ్రెస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ప్రగతినగర్‌లో పేద విద్యార్థులకు ఉచిత విద్య అందించడం అభినందనీయమని డీఈవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో సోమవారం నిర్వహించిన ప్రగతి టాలెంట్ టెస్ట్‌ను ప్రారంభించి మాట్లాడారు. నిరుపేద విద్యార్థుల అభ్యున్నతికి పాటు పడుతున్న ట్రస్ట్ సామాజిక సేవను కొనియాడారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.కిష్టన్న, అశోక్, లక్ష్మణ్ రావ్, తదితరులున్నారు.

క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పట్టుబడిన ట్రాక్టర్లు, డ్రైవర్లు

వేమనపల్లి: మండలంలోని ముల్కలపేట మత్తడివాగు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా రాత్రివేళ ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను సోమవారం వేకువజామున పట్టుకున్నట్లు నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్ తెలిపారు. ట్రాక్టర్లను పోలీసుస్టేషన్‌కు తరలించారు. కేతన్‌పల్లికి చెందిన ట్రాక్టర్ యజమానులు గురుండ్ల సంతోష్, చెన్నూరి సాలయ్య, డ్రైవర్ టకిరే పున్నంలపై కేసు నమోదు చేశామన్నారు. ఎలాంటి అనుమతి లేకుండా ప్రాణహిత నది, ఇతర వాగుల్లో నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

చోరీకి పాల్పడిన ఇద్దరి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని రజిత జిన్నింగ్ మిల్లులో చోరీకి పాల్పడిన ఇద్దరిని సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. పట్టణంలోని డాల్డా కంపెనీ ఏరియాకు చెందిన షేక్ ముజమ్మిల్, సయ్యద్ మహబూబ్‌లు ఈనెల 3న రజిత జిన్నింగ్ మిల్లులో కేబుల్ వైర్లు చోరీ చేశారు. నిందితులను పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

ఎంసీసీలో చోరీ

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని మూతపడిన ఎంసీసీలో సోమవారం వేకువజామున చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు ప్రహరీ దూకి రూ.1.50 లక్షల విలువ గల కాపర్ (రాగి), వైట్ మెటల్‌ను ఎత్తుకెళ్లారని ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సెక్యూరిటీ గార్డు ఎలుకపెల్లి రాజ్‌కుమార్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆలయంలో చోరీకి యత్నం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని అశోక్‌రోడ్‌లో గల పోచమ్మ ఆలయంలో ఆదివారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి చోరీకి యత్నించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆలయంలో పోసాని పనిచేసి ఇంటికి వెళ్లింది. సాయంత్రం 6 గంటల సమయంలో వచ్చి చూడగా అమ్మవారి మెడలో ఆభరణాలు, వస్త్రాలను తెంపివేసి చిందరవందరగా ఉన్నాయి. దీంతో వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సునీల్‌కుమార్ తెలిపారు.

ట్రిపుల్‌ఐటీ విస్తరణ

- బాసరకు అనుబంధంగా మరో రెండుచోట్ల ఏర్పాట్లు
- ఎల్కతుర్తిలో పూర్తయిన భూసర్వే
- మహబూబ్‌నగర్‌లోనూ భూ పరిశీలన



బాసర ట్రిపుల్‌ఐటీ

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీకి అనుబంధంగా మరో రెండు క్యాంపస్‌ల ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టిసారించింది. ఇప్పటికే ఎల్కతుర్తిలో భూసర్వే పూర్తిచేసిన అధికారుల బృందం తాజాగా ఈనెల 3న మహబూబ్‌నగర్‌లోనూ భూములు పరిశీలించింది. బాసర ట్రిపుల్‌ఐటీ వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్, జేఎన్‌టీయూహెచ్ మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మంజూర్ హుస్సేన్ రెవెన్యూ అధికారులతో కలిసి మహబూబ్‌నగర్ సమీపంలోని భూములను పరిశీలించారు. 40 నుంచి 50 ఎకరాల భూములు అవసరమవుతాయని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డికి తెలిపారు. అధికార బృందంతో ఎమ్మెల్యేతో చర్చించి ప్రభుత్వానికి నివేదిక అందించింది.

అనుబంధంగా మరో రెండు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2008లోనే దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి గ్రామీణ నిరుపేద విద్యార్థుల చదువుల కోసం ట్రిపుల్‌ఐటీలను ప్రారంభించారు. నూజివీడు, ఇడుపులపాయతోపాటు బాసరలో ట్రిపుల్‌ఐటీలను నెలకొల్పారు. ఒక్కో క్యాంపస్‌లో 1500 మంది విద్యార్థులకు సీట్లు ఇచ్చి అవకాశాలు కల్పించారు. రాష్ట్రం ఏర్పడ్డాక ఒకే ట్రిపుల్ ఐటీ బాసరలో మిగిలింది. ఈ క్యాంపస్‌కు అనుబంధంగా మరో రెండు ట్రిపుల్‌ఐటీల ప్రారంభంపై ప్రభుత్వం దృష్టిసారించింది.

కొత్త ప్రభుత్వం రావడంతోనే..

గత పదేళ్లపాటు కేసీఆర్ హయాంలో ఒకే ట్రిపుల్ ఐటీ ఉండగా, తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కొత్త క్యాంపస్‌ల ఏర్పాటుపై దృష్టిసారించింది. గత ఎన్నికల ప్రచారంలో నాలుగు ట్రిపుల్‌ఐటీలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది. ఇందులోభాగంగా ఇప్పటికే ఎల్కతుర్తి, మహబూబ్‌నగర్‌లో భూసర్వేలు పూర్తిచేసింది. త్వరలోనే ఖమ్మం, నల్గొండలోనూ మరో రెండు క్యాంపస్‌ల ఏర్పాట్లపై దృష్టిసారించింది.

పెరుగనున్న సీట్లు

రాష్ట్రంలో ఉన్న ఏకైక ట్రిపుల్‌ఐటీ బాసరలో ఏటా ప్రవేశాల సమయంలో వేల సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయి. ఆరేళ్ల ఇంజినీరింగ్ విద్యావిధానంలో ఇక్కడ చదువుతున్న విద్యార్థులకు ప్లేస్‌మెంట్లతోపాటు ప్రభుత్వ ఉద్యోగాలు దక్కుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా తల్లిదండ్రులకు ట్రిపుల్‌ఐటీలో చేర్పించాలన్న కోరిక పెరుగుతుంది. తాజాగా రెండుచోట్ల కొత్త క్యాంపస్‌లు ఏర్పాటు చేయనుండడంతో 3 వేల సీట్లు పెరగనున్నాయి. రెండు కొత్త క్యాంపస్‌లు ప్రారంభమైతే బాసరతోపాటు అనుబంధంగా ఏర్పడే ఎల్కతుర్తి, మహబూబ్‌నగర్ ట్రిపుల్‌ఐటీల్లో ప్రతిఏటా 4500 మంది విద్యార్థులు చదువుకునేందుకు అవకాశం దక్కుతుంది. గ్రామీణ నిరుపేద విద్యార్థులకు కొత్త క్యాంపస్‌లు ఎంతో మేలు చేయనున్నాయి.

నివేదించాం

మహబూబ్‌నగర్ సమీపంలో ట్రిపుల్‌ఐటీ ఏర్పాటు కోసం భూములు పరిశీలించాం. గత మూడు నెలల క్రితం ఎల్కతుర్తిలో భూములను పరిశీలించాం. బాసరకు అనుబంధంగా కొత్త క్యాంపస్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సూచించింది. ఆ మేరకు భూములు పరిశీలించి సర్కారుకు నివేదించాం.
– గోవర్ధన్, ట్రిపుల్‌ఐటీ వీసీ, బాసర

గిరిజనుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల ప్రజలు తమ సమస్యలపై అందించిన అర్జీలను ఆమె స్వీకరించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో మాట్లాడుతూ అర్జీలను శాఖల అధికారులు పరిశీలించి న్యాయం చేయాలన్నారు. వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీవో మనోహర్, ఏవో దామోదర స్వామి, ఈఈ తానాజీ, పీహెచ్‌వో సందీప్, డీపీవో ప్రవీణ్, జేడీఎం నాగభూషణం పాల్గొన్నారు.

- ఉట్నూర్ మండలం కమాయిపేట గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని భీంరావు అర్జీ అందించాడు.
- బోథ్ మండలం సాంగ్వి గ్రామానికి చెందిన రాజేశ్వరి తనకు ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టా మంజూరు కల్పించాలని విన్నవించింది.
- కుమురం భీం జిల్లా జైనూరు మండలం పాట్నాపూర్‌కు చెందిన ఆత్రం లత తనకు ఏదైనా ఉద్యోగం ఇప్పించాలని వేడుకుంది.
- 9 నెలలు గడిచినా వేతనాలు చెల్లించని సొల్యూషన్ విద్యాంజలి సంస్థ జిల్లా కోఆర్డినేటర్లపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ ఆధ్వర్యంలో అర్జీ అందించారు.

గొర్రెపై చిరుత దాడి



గాయపడ్డ గొర్రె

నర్సాపూర్(జి): మండలంలోని కుస్లి గ్రామ శివారులో గొర్రెపై చిరుత దాడి చేసి గాయపర్చింది. ఎఫ్‌బీవో సాయారెడ్డి తెలిపిన వివరాలు.. కుస్లికి చెందిన ఎం.సాయినాథ్ సోమవారం మేత కోసం గొర్రెలను గ్రామశివారులోకి తీసుకెళ్లాడు. ఈక్రమంలో గొర్రెపై చిరుత దాడి చేసి గాయపర్చింది. వెంటనే అటవీ అధికారులకు సమాచారం అందించారు. ఎఫ్‌బీవో సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. చిరుత సంచారంపై గొర్రెలు, పశువుల కాపర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ వినియోగించాలి



అవగాహన పోస్టర్లను అందిస్తున్న జావిద్

మంచిర్యాలటౌన్: వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాలతో జిల్లాలోని అన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌ను వినియోగించాలని పాత్ ఎన్జీవో స్టేట్ ప్రోగ్రాం ఆఫీసర్ జావిద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేటు ఆసుపత్రులు, మెడికల్ షాపుల్లో ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, వైద్యులతో కలిసి సోమవారం పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ ఆసుపత్రికి వచ్చే రోగుల వివరాలను ఆయుష్మాన్ భారత్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. దీనివల్ల ఆసుపత్రులకు, ఫార్మసీకి వచ్చే రోగుల హెల్త్ కార్డును లింక్ చేస్తే జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా ప్రతీ కార్డుకు రూ.20 చొప్పున ఇన్సెంటివ్ పొందవచ్చని తెలిపారు. రోగుల సంరక్షణకు, డిజిటల్ ఆరోగ్య సేవలను ప్రజలు పొందేందుకు, వారి ఆరోగ్య డేటా సంరక్షించుకునేందుకు ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ ఉపయోగపడుతుందని వివరించారు. పాత్ ఎన్జీవో సభ్యులు నరేశ్, డీపీవో ప్రశాంతి, జాతీయ ఆరోగ్య మిషన్ ప్రవళిక, జిల్లా మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు పశువులపాక దగ్ధం



పాకలో చెలరేగుతున్న మంటలు

తానూరు: మండలంలోని ఉమ్రి(కే) గ్రామంలో సోమవారం ప్రమాదవశాత్తు పశువుల పాక దగ్ధమైంది. తహసీల్దార్ లింగమూర్తి, బాధిత రైతు నర్సింగ్ తెలిపిన వివరాలు.. గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలంలో రైతులు సాయంత్రం గడ్డి కుప్పలకు నిప్పంటించారు. వీస్తున్న గాలికి నిప్పురవ్వలు పశువుల పాకలో గడ్డికి అంటుకోవడంతో నిల్వ ఉంచిన పశుగ్రాసంతోపాటు పనిముట్లు కాలిపోయాయి. గ్రామస్తులు అందించిన సమాచారంతో తహసీల్దార్ లింగమూర్తి, ట్రెయినీ ఎస్సై నవనీత్‌రెడ్డి, అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలార్పివేశారు. ప్రమాదంలో రూ.40 వేల ఆస్తి నష్టం వాటిల్లిందని తహసీల్దార్ తెలిపారు.

వరి పంట దగ్ధం

నర్సాపూర్(జి): మండలంలోని రాంపూర్‌కు చెందిన రైతు నసీరాబాద్ శివారులో సాగు చేస్తున్న వరి పంట సోమవారం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. పొలంలో 11 కేవీ వైరు తెగిపడి నిప్పు రాజుకోవడంతో 5 గుంటల వరి దగ్ధమైనట్లు బాధిత రైతు తెలిపాడు.

జొన్నలేప తిని మూడు లేగదూడలు మృతి

దిలావర్‌పూర్: మండలంలోని మాడేగం గ్రామ శివారు పంట చేలలో మూడు లేగదూడలు జొన్న లేప తిని మృతిచెందాయి. బాధిత రైతు పులిండ్ల విజయ్, స్థానికులు తెలిపిన వివరాలు.. ప్రతీరోజులాగా లేగదూడలు సోమవారం మేత మేయడానికి వెళ్లాయి. గ్రామశివారులోని పంట చేలలో జొన్న లేప తిని నోటినుంచి తెల్లగా బురుసు వచ్చింది. రైతులు గమనించి వెంటనే వెటర్నరీ అసిస్టెంట్ డాక్టర్ విజయ్‌కు సమాచారం అందించారు. ఆయన అక్కడికి చేరుకుని చికిత్స అందిస్తుండగానే మృతిచెందాయి. ఒక్కో లేగదూడ రూ.30 వేలుపైగా ఉంటుందని బాధిత రైతు తెలిపాడు

ట్యాంక్ ఎక్కితేనే..సిగ్నల్



కడెం: 4జీ, 5జీ టెక్నాలజీ ఎంతో ముందుకెళ్తున్నా నేటికి మొబైల్ నెట్‌వర్క్ లేని గ్రామాలు ఉన్నాయి. మండలంలోని మారుమూల ఇస్లాంపూర్‌కు నెట్‌వర్క్ లేక స్థానికులు సోమవారం ఇలా వాటర్ ట్యాంక్‌లు, చెట్లెక్కి సెల్‌ఫోన్‌ను వినియోగిస్తున్నారు.

జూన్ 3 నుంచి టెన్త్ అడ్వాన్స్ సప్లిమెంటరీ

మంచిర్యాలఅర్బన్: పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 3 నుంచి 13 వరకు నిర్వహించనున్నట్లు డీఈవో యాదయ్య ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో వారు చదువుతున్న పాఠశాల పదోతరగతి స్కూల్‌కోడ్ ద్వారా చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పరీక్ష రుసుము 1 నుంచి 3 సబ్జెక్టులకు రూ.110, మూడు కంటే ఎక్కువ సబ్జెక్టులుంటే రూ.125 చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. అపరాధ రుసుము లేకుండా ఈనెల 15వరకు చెల్లించవచ్చని ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేకాడుతూ ఐదుగురి అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని లారీ అసోసియేషన్ ప్రాంతంలో పేకాడుతున్న ఐదుగురిని సోమవారం అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.8800 నగదుతోపాటు పేక ముక్కలు, నాలుగు ఫోన్లు, నాలుగు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వివాహిత అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీకి చెందిన వివాహిత సువర్ణ అదృశ్యమైంది. గతనెల 26న ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ దొరకలేదు. భర్త శంకర్ సోమవారం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు.

క్షయరహిత సమాజం కోసం కృషిచేయాలి

భీమిని: క్షయ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్ పేర్కొన్నారు. భీమిని పీహెచ్‌సీలో సోమవారం ఏర్పాటు చేసిన ఏపీఎఫ్ టీబీ యాక్టివ్ కేసు నిర్ధారణ క్యాంప్ అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ఏ వయస్సు వారికైనా క్షయ లక్షణాలు ఉన్నట్లయితే గ్రామాల్లో ఆశకార్యకర్తలు, ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. అంతకుముందు 35 మందికి పరీక్షలు నిర్వహించారు. ఇన్‌చార్జి వైద్యుడు అనిల్‌కుమార్, సీఎచ్‌వో జలపతి, హెల్త్ అసిస్టెంట్ ఉమాశంకర్, ఎల్‌టీ చెన్నకేశవ, ఏపీఎఫ్ వ్యాన్ టెక్నీషియన్ శ్రీకాంత్, రవికుమార్ పాల్గొన్నారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురు ఆత్మహత్య

ఆదిలాబాద్ జిల్లాలో వేర్వేరు కారణాలతో ముగ్గురు బలవన్మరణం చెందారు. అనుమానాస్పద స్థితిలో వివాహిత, నీట్‌లో ర్యాంక్ రాదోనని బెంగతో యువకుడు ఉరేసుకున్నారు. మద్యానికి బానిసైన యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత..



సుప్రియ మృతదేహం

ఉట్నూర్‌రూరల్: అనుమానాస్పద స్థితిలో వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మండల కేంద్రంలోని పాత ఉట్నూర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. మృతురాలి బంధువులు తెలిపిన వివరాలు.. మండలంలోని గంగాపూర్‌కు చెందిన సంజీవ్ మూడో కుమార్తె సుప్రియ(22)ను ఐదేళ్ల క్రితం ఉట్నూర్ మండలం పాత ఉట్నూర్‌కు చెందిన జాడి రాధాకృష్ణతో వివాహమైంది. వీరికి ఓ పాప(4) సంతానం. రాధాకృష్ణ కూలీ పనిచేసుకుని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గతకొన్ని రోజులుగా వరకట్నం తేవాలని భార్యను మానసికంగా వేధించసాగాడు. ఈక్రమంలో ఆదివారం మద్యం తాగి ఇంటికి వచ్చాడు. భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. రాత్రి మనస్తాపంతో చీరతో ఇంట్లో ఉరేసుకుంది. గమనించిన భర్త, బంధువుల సహాయంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. భర్త బంధువులు ఈ విషయాన్ని సుప్రియ తల్లిదండ్రులకు చెప్పారు. బంధువులతో కలిసి వారు అక్కడికి చేరుకుని రోదించారు. తన కూతురిని అల్లుడు కొట్టి హత్య చేసి ఉరేసి ఆత్మహత్య చేసుకున్నట్లు చిత్రీకరిస్తున్నాడని ఆరోపించారు. తండ్రి ఫిర్యాదుతో సోమవారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మొగిలి తెలిపారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

నీట్‌లో ర్యాంక్ రాదనే బెంగతో యువకుడు..



మనోజ్ (ఫైల్)

ఉట్నూర్‌రూరల్: నీట్‌లో ర్యాంక్ రాదనే బెంగతో యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలకేంద్రంలో చోటుచేసుకుంది. సీఐ మొగిలి కథనం ప్రకారం..మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డులో గంగాధర్‌కు ఏకైక కుమారుడు మనోజ్ (18) ఇంటర్ పూర్తి చేసి నీట్ పరీక్ష కోసం లాంగ్‌టర్మ్ కోచింగ్ తీసుకున్నాడు. ఇటీవల రాసిన నీట్ పరీక్షలో మంచి ర్యాంక్ రాదేమోనని బెంగతో సోమవారం ఇంట్లో ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. వైద్యులు పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అప్పగించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కుమారుడు డాక్టర్ కావాలని ఆశయంతో కష్టపడి చదివిస్తే అప్పుడే నూరేళ్లు నిండాయని తల్లిదండ్రులు రోదిస్తున్న తీరు అందరిని కంటతడి పెట్టించింది. పరీక్షల్లో ఫెయిల్, ర్యాంక్ రావని విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవద్దని మళ్లీ సాధిస్తామని మనోధైర్యంతో ముందుకు వెళ్లాలని, తల్లిదండ్రులకు పుత్రశోకం మిగిల్చవద్దని పలువురు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

మద్యానికి బానిసై యువకుడు..

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్‌రూరల్ మండలం అంకోలికి చెందిన యువకుడు పుట్ట భవన్ (25) మద్యానికి బానిసై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం సాయంత్రం పట్టణంలో పురుగుల మందు తాగి పడిపోగా, స్థానికులు గమనించి రిమ్స్‌కు తరలించారు. రాత్రి చికిత్స పొందుతూ మృతిచెందాడు. తండ్రి హన్మాండ్లు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు.


తప్పిన ప్రమాదం



తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో కాలిన చెత్త

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం రాత్రి అగ్ని ప్రమాదం తప్పింది. సిబ్బంది కార్యాలయంలో పనికి రాని చెత్తాచెదారాన్ని కాల్చివేశారు. అయితే కాల్చిన చెత్త పూర్తిగా ఆరక ముందే వెళ్లిపోగా రాత్రి ఒక్కసారిగా గాలిదుమారం వీచడంతో మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. మంటలు చెలరేగిన సమీపంలో రికార్డు రూం ఉంది. ఆ సమయంలో మంటలు వ్యాపించక పోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. స్థానికులు తహసీల్దార్, పోలీసులకు సమాచారం అందించగా పరిస్థితిని సమీక్షించి ఎలాంటి ముప్పు జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

నటరాజ కళాక్షేత్ర విద్యార్థులకు అభినందన



అభినందిస్తున్న ఎంపీ, కలెక్టర్

జన్నారం: అరుద్ర నాట్య సమర్పణం ఆధ్వర్యంలో మలేషియా ఫెస్టివల్‌లో భాగంగా నిర్వహించిన కూచిపూడి నృత్య పోటీల్లో జన్నారంలోని నటరాజ కళాక్షేత్రం మాస్టర్ గాజుల నర్మదగౌడ్‌తోపాటు విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబర్చారు. సోమవారం మంచిర్యాల కలెక్టర్ కార్యాలయంలో పెద్దపెల్లి ఎంపీ వంశీకృష్ణ, కలెక్టర్ కుమార్ దీపక్ ఈ సందర్భంగా వారిని అభినందించారు. ప్రశంసపత్రాలతో అభినందనలు తెలియజేశారు.

సమ్మె నోటీసు అందజేత




డిప్యూటీ లేబర్ కమిషనర్‌కు నోటీసు అందజేస్తున్న జేఏసీ నాయకులు

శ్రీరాంపూర్: దేశవ్యాప్తంగా ఈనెల 20న నిర్వహించే సమ్మెను 17 డిమాండ్లతో కూడిన నోటీసును సింగరేణి కార్మిక సంఘాల జేఏసీ నేతలు యజమాన్యానికి అందించారు. సోమవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సీఎండీ ఎన్. బలరాంనాయక్, డిప్యూటీ లేబర్ కమిషనర్ డి.శ్రీనివాస్‌లకు ఈ నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు, హెచ్‌ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్, ఐఎఫ్‌టీయూసీ జనరల్ సెక్రెటరీ సీతారామయ్య, సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు డి.బ్రహ్మానందం, తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం కార్యదర్శి కామెర గట్టయ్య, ఏఐఎఫ్‌టీయూ అధ్యక్షుడు జి. రాములు, టీఎన్టీయూసీ జనరల్ సెక్రెటరీ మనీ రాంసింగ్, ఎస్‌జీకేఎస్ అధ్యక్షుడు మహేందర్ మాట్లాడుతూ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ సమ్మె ఉంటుందన్నారు. దేశవ్యాప్త డిమాండ్లతోపాటు సింగరేణి పరిధిలో డిమాండ్లను సమ్మెలో పెట్టామన్నారు. సింగరేణిలో కొత్త భూగర్భ గనులకు కేంద్రం అనుమతి ఇవ్వాలని, కాంట్రాక్ట్ కార్మికులకు కోలిండియాలో మాదిరిగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికవర్గ మనగడకు ముప్పు తెస్తున్న కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాలను రద్దు చేయాలన్నారు. కార్మిక వర్గం ఈ సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జేఏసీ నాయకులు బోసు, బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమ్మె నోటీసు..

బెల్లంపల్లి: దేశవ్యాప్త సమ్మెకు మద్దతుగా తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) నాయకులు సమ్మె నోటీసు ఇచ్చారు. సోమవారం బెల్లంపల్లి సీడీపీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ఐసీడీఎస్ వ్యవస్థకు తగిన బడ్జెట్ కేటాయింపులు చేయడం లేదని విమర్శించారు. ఈ సమ్మెకు అంగన్‌వాడీలు మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు భానుమతి, కార్యదర్శి రాజమణి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రమణ, మండల కన్వీనర్ చల్లూరి దేవదాస్, నెన్నెల సెక్టార్ నాయకురాలు చంద్రకళ, సువర్ణ, విశ్వనాథ్ పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలని ధర్నా



నల్లబ్యాడ్జీలు ధరించి నినాదాలు చేస్తున్న కార్మికులు

బెల్లంపల్లి: గత ఫిబ్రవరి నుంచి మూడు నెలల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఔట్ సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగులు ఆందోళనకు దిగారు. తెలంగాణ మెడికల్,హెల్త్ ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నల్లబ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులు చేత పట్టుకుని ఏరియా ఆసుపత్రి ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు, కార్మికులు మాట్లాడుతూ ఆలస్యం చేయకుండా వేతన బకాయిలను విడుదల చేయాలని లేకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఏరియాఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవి కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఓం నారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్, లక్ష్మణ్, రమేశ్, నీరజ, సాయి, మహేశ్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.